
ప్రజాశక్తి

సోమవారం 11 మార్చి 2024 విజయనగరం





మన్యం బంద్ విజయవంతం

ఏజెన్సీ ప్రాంతంలోని ఉద్యోగాలు వంద శాతం గిరిజనులకే కేటాయించాలని, స్పెషల్ డిఎస్‌సి ప్రభుత్వం వెంటనే ప్రకటన చేయాలని తదితర సమస్యలపై ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన ఆదివారం చేపట్టిన మన్యం బంద్ పార్వతీపురం మన్యం జిల్లాలో విజయవంతమైంది. గిరిజనులు స్వచ్ఛందంగా బంద్ పాటించారు. పలుచోట్ల ఆ సంఘం ఆధ్వర్యాన నిరసన ప్రదర్శనలు చేపట్టారు.



ఎంపి, ఎమ్మెల్యేలను నిలదీస్తున్న నిర్వాసితులు (ఫైల్)

నిర్వాసితులపై నిర్లక్ష్యం

- పరిహారం, పునరావాసానికి రూ.193.21కోట్లు అవసరం
- అదిగో.. ఇదిగో అంటూనే ఐదేళ్లు కాలక్షేపం
- ఎన్నికల వేళ నిలదీతలు

జిల్లాలోని తారకరామ తీర్థసాగర్ నిర్వాసితులపై ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించింది. ఐదేళ్లుగా అదుగో ఇదిగో అంటూనే కాలక్షేపం చేసుకొచ్చిన వైసిపి ప్రభుత్వం ప్రాజెక్టుల్ని తమ హయాంలోనే అభివృద్ధి చెందాయంటూ కితాబిచ్చుకొంటోంది. ఇవన్నీ వట్టిమాటలు కావడంతో నిర్వాసితులు... అధికార పార్టీ నాయకులపై అగ్గిమీద గుగ్గిలమౌతున్నారు. నాలుగు రోజుల క్రితం తారకరామతీర్థసాగర్ ప్రాజెక్టు నిర్వాసితులు స్థానిక ఎమ్మెల్యే, ఎమ్‌పిలను చుట్టుముట్టి ప్రశ్నించడమే ఇందుకు తార్కాణంగా చెప్పుకోవచ్చు.

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలో నాలుగు మండలాల్లో 24 వేల ఎకరాలకు సాగునీరు, విజయనగరం వాసులకు తాగునీటి అవసరాలు తీర్చేందుకు 2004లో రామతీర్థసాగర్ నిర్మాణం చేపట్టిన విషయం విదితమే. ఇందులో భాగంగా అప్పట్లోనే కోరాడపేట, పడాలపేట, ఆత్మారామునిఅగ్రహారం గ్రామాలను పూర్తిగా ముంపు ప్రాంతాలుగా గుర్తించారు. సారిపల్లి వాసులు పూర్తిగా భూములు కోల్పోతారని ఆ రిపోర్టులో పేర్కొన్నారు. భూములన్నీ పోయాక ఊళ్లో ఉండి తామేం చేస్తామన్నది సారిపల్లి వాసుల వాదన. ఈ నేపథ్యంలో తమను ప్రత్యేకంగా ఆదుకోవాలంటూ ఆ గ్రామస్తులు కోరారు. ఇందుకు నాటి టిడిపి, అంతకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వాలతోపాటు వైసిపి కూడా అంగీకరించినప్పటికీ ఆచరణలో ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదు. అటు పూర్తి ముంపు గ్రామాల గురించి కూడా పట్టించుకోలేదు. ప్రభుత్వం గుర్తించిన మూడు ముంపు గ్రామాల నిర్మాణ విలువ (స్ట్రక్చరల్ వ్యాల్యూ) రూ.34.46 కోట్లుగా అప్పట్లో లెక్కించారు. ప్రస్తుతం దీని విలువ సుమారు నాలుగు రెట్లు పెరిగి ఉంటుంది. కోరాడపేటలోని 171 కుటుంబాలవారికి పునరావాస కాలనీ నిర్మించేందుకు చాలా ఏళ్ల క్రితమే 19.6 ఎకరాల భూమిని గుర్తించారు. ఇంటి నిర్మాణానికి రూ.2.84 లక్షల చొప్పున మంజూరు చేస్తామంటూ అప్పట్లో ఇచ్చిన హామీ గాలికి వదిలేశారు. ఇక పడాలపేట, ఎటి అగ్రహారం గ్రామాల నిర్వాసితులకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద కుటుంబానికి రూ.6.75 లక్షల చొప్పున చెల్లించేందుకు 2012 నాటి ప్రభుత్వం ప్రతిపాదించగా నిర్వాసితులు ఇందుకు సమ్మతించారు. ఈ లెక్కన రెండు గ్రామాల్లోని 648 కుటుంబాలకు మొత్తం రూ.43.74 కోట్ల మేర విడుదల చేయాలి. అది కూడా అమలుకు నోచుకోలేదు. సారిపల్లి గ్రామంలోని ప్రజలంతా ఇళ్లు తప్ప సర్వం కోల్పోతున్నందుకు ప్రత్యేక ఆర్థిక సాయం చేస్తామంటూ గతంలో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. ఈ లెక్కన మొత్తం 1450 కుటుంబాలకు రూ.75.69 కోట్లు అవసరమౌతుందని అధికారులు అంచనా రూపొందించి ఏళ్లు గడుస్తున్నాయి. ఈ నాలుగు గ్రామాల వారికి వివిధ రూపాల్లో ప్రభుత్వం సుమారు రూ.193.21 కోట్ల మేర విడుదల చేయాల్సి ఉండగా, ఇందుకు ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఎంత మొత్తం కేటాయిస్తారోనని గత నెలలో నిర్వాసితులు ఓట్ ఆన్ బడ్జెట్‌లో స్పష్టత ఇవ్వలేదు. పరిస్థితి ఇలా ఉంటే జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు విలేకర్ల సమావేశం ఏర్పాటుచేసి మరీ పరిశ్రమలు, నిర్వాసితుల కోసం వైసిపి ప్రభుత్వం నిధులు గుమ్మరించినట్లు చెప్పుకొచ్చారు. ఇదే నిజమైతే వైసిపి నాయకులు ఎందుకు నిలదీతలకు గురౌతారో ఆయనే చెప్పాల్సి ఉంది. ఏళ్ల తరబడి ఎదురు చూసిన సారిపల్లి నిర్వాసితులు ఈ నెల 6న ఎన్నికల ప్రచారంలో భాగంగా వచ్చిన స్థానిక ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎంపి బెల్లాన చంద్రశేఖర్‌లను నిలదీశారు. ఎప్పుడూ హామీలు తప్ప అమలు చేయడం కనిపించడం లేదంటూ మండిపడ్డారు.

తెగించి పోరాడితేనే మహిళలకు రక్షణ

సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు



సదస్సులో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మహిళలపై హింసకు వ్యతిరేకంగా, హక్కులను కాపాడుకోవడం కోసం తెగించి పోరాడితే తప్ప రక్షణ లేదని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు స్పష్టంచేశారు. ప్రజాసంఘాల సహకారంతో హక్కుల రక్షణకు మహిళలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఆదివారం ఐద్వా, సిఐటియు, యుటిఎఫ్, ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్ నుంచి కెఎల్‌పురంలోని ప్రజాసంఘాల కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం శ్రామిక మహిళా సంఘం జిల్లా కన్వీనర్ వి.లక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళల పట్ల చిన్నచూపు చూస్తూ పురుషాధిక్యత పాలన సాగిస్తున్నారని తెలిపారు. మనువాద సిద్ధాంతాన్ని అమలు చేస్తూ మహిళలను వంటింటికి పరిమితం చేసే విధంగా మోడీ పాలన సాగుతుందన్నారు. పనిచేసే ప్రదేశాల్లో మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. పని ప్రదేశాల్లో ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ మహిళలపై వేధింపులు చేస్తే అరెస్టు చేసి జైలు శిక్ష విధించాల్సి ఉందన్నారు. అందుకు ఉదాహరణగా విజయనగరం జిల్లాలో బయోటెక్ కంపెనీలో పార్వతి అనే మహిళపై హెచ్‌ఆర్ వేధింపులు పాల్పడితే జిల్లా కలెక్టర్, ఎస్‌పికు ఫిర్యాదు చేసి, మూడేళ్లవుతున్నా పట్టించుకోలేదని చెప్పారు. ఈ ఘటన అధికారులు, పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. పార్వతికి న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదని, ఆమెకు మహిళలు అండగా నిలబడాలని కోరారు. పరిశ్రమల్లో లైంగిక వేధింపుల నివారణకు కమిటీలు ఏర్పాటు చేయాల్సి ఉందని కానీ ఏ కంపెనీలోనూ కమిటీలు లేవన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చినా అమలు చేయకపోవడం లేదన్నారు. గృహ హింసకు వ్యతిరేకంగా పోరాడాల్సి ఉందన్నారు. మహిళల హక్కులను హరిస్తున్న ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. అనంతరం యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.విజయగౌరి మాట్లాడుతూ మహిళలకు 33 శాతం రిజర్వేషన్ బిల్లు పెట్టారు తప్ప అమలు చేయకపోవడం మహిళల పట్ల బిజెపి ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. అనంతరం సదస్సులో ఐద్వా జిల్లా కార్యదర్శి పి.రమణమ్మ, జెవివి సమతా విభాగం కన్వీనర్ జి.నిర్మల, ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు సౌమ్య, ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎస్.అనసూయ మాట్లాడుతూ మహిళలు ఐక్యంగా ఉద్యమిస్తేనే రక్షణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహనరావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రమేష్ పట్నాయక్, జెఎవిఆర్‌కె ఈశ్వరరావు, ఎపి అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షులు బి.పైడిరాజు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, నగర కార్యదర్శి బి.రమణ పాల్గొన్నారు.



ర్యాలీ చేపడుతున్న ప్రజా సంఘాల నాయకులు, మహిళలు

సంక్షేమానికి సిఎం కొత్త నిర్వచనం

మంత్రి బొత్స సత్యనారాయణ



ఇంటి పట్టాలను అందజేస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి-చీపురుపల్లి

ప్రజా సంక్షేమానికి సిఎం జగన్ కొత్త నిర్వచనం చెప్పారని మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. ఆదివారం చీపురుపల్లిలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శ్రీకారం చుట్టారు. కర్లాం నుంచి నిమ్మలవలసకు రూ.2.25 కోట్లతో ప్రతిపాదించిన రహదారి నిర్మాణానికి కర్లాం వద్ద, జి.ములగాం నుంచి కోనూరుకు రూ.7 కోట్లతో ప్రతిపాదించిన రహదారి నిర్మాణానికి ములగాం వద్ద ఆయన శంకుస్థాపన చేశారు. చీపురుపల్లిలో నిర్మించిన సచివాలయం-5 ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సభల్లో మంత్రి బొత్స మాట్లాడుతూ తన సుదీర్ఘ రాజకీయ చరిత్రలో ఇంత గొప్పగా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసిన ముఖ్యమంత్రిని ఇంతవరకు చూడలేదని కితాబిచ్చారు. 14 ఏళ్ల పాటు ముఖ్యమంత్రిగా పని చేసిన చంద్రబాబు నాయుడు ఇలాంటి సంక్షేమ కార్యక్రమాలను ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. తాము ప్రజాధనాన్ని ప్రజలకు పంచితే, గత ప్రభుత్వంలో మాత్రం దోచుకుతిన్నారని విమర్శించారు. అవినీతి రహితంగా, పూర్తి పారదర్శకంగా సంక్షేమ పథకాలను అర్హులందరికి అందజేశామని చెప్పారు. ఈ సంక్షేమ కార్యక్రమాలు కొనసాగాలన్నా, ప్రజలకు మరింత మేలు జరగాలన్నా ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డి ఉండాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు. గత ప్రభుత్వానికి తమ ప్రభుత్వానికి మధ్య తేడా చూడాలని, అభివృద్ధిని తాము ఒక బాధ్యతగా భావిస్తామని చెప్పారు. మీ ఇంటికి మంచి జరిగి ఉంటే మరొక అవకాశం ఇవ్వాలని ధైర్యంగా ప్రజలను అడగగలిగే నాయకుడు ఒక్క జగన్మోహన్ రెడ్డి మాత్రమేనని స్పష్టం చేశారు. అనంతరం ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి, కార్యక్రమాలను వివరించారు. కర్లాం గ్రామంలోనే సుమారు రూ.25.5 కోట్లతో సంక్షేమ, దాదాపు నాలుగు కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామన్నారు. ఆయా గ్రామాలకు మంత్రి బొత్స సత్యనారాయణ పలు వరాలను ప్రకటించారు. చీపురుపల్లిలో లబ్ధిదారులకు రిజిస్టర్డ్ ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, ఎఎంసి చైర్మన్ డి.జనార్దనరావు, ఎంపిపి ఇప్పిలి వెంకట నరసమ్మ, జెడ్‌పిటిసి వలిరెడ్డి శిరీష, చీపురుపల్లి సర్పంచ్ ఎం.సుధారాణి, కర్లాం సర్పంచ్ బి.భాగ్యలక్ష్మి, జి.ములగాం సర్పంచ్ కె.శ్రీనివాసరావు నాయుడు, తహశీల్దార్ ఎన్.ప్రసాదరావు, ఎంపిడిఒ శ్వేత, వైసిపి నాయకులు ఇప్పిలి అనంత్, వలిరెడ్డి శ్రీనివాసరావు, మీసాల వరహాలనాయుడు, జనార్దన్, అప్పారావు, శ్రీనివాసరావు, మండల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



వెలవెలబోయిన క్వారీ

క్వారీ బతుకులు గల్లంతు

జిల్లాలో క్వారీ కార్మికులకు ఉపాధి గల్లంతు అవుతోంది. ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రయివేటు విధానంతో క్వారీ కార్మికుల ఉపాధికి తీవ్ర ముప్పు వాటిల్లింది. ఇప్పటికే జామి మండల కేంద్రంలోని క్వారీలపై ఆధార పడి బతుకుతున్న సుమారుగా 500కు పైగా దళిత కుటుంబాలు రోడ్డున పడ్డాయి. తాతలు తండ్రుల నుంచి క్వారీలనే నమ్ముకుని జీవిస్తున్న క్వారీ బతుకులు ఒక్కసారికి కనుమరుగు అవుతున్న నేపథ్యంలో ఇతర ప్రాంతాలకు వలసలు పోవాల్సిన పరిస్థితులు దాపురించాయి. జామి గ్రామంలోనే కాదు... జిల్లాలో వేపాడ, వావిలపాడు, బొద్దాం, సోంపురం, ఆలుగుబిల్లితోపాటు జిల్లా వ్యాప్తంగా క్వారీలు మూతబడి వాటిపై ఆధారపడ్డ స్టోన్ క్రషర్లు మూసేశారు. ఫలితంగా కార్మికులు, డ్రైవర్లు, హెల్పర్లు వంటి అనేక రకాల పనులపై తీవ్ర ప్రభావం పడింది.

- ప్రయివేటు విధానంతో ఉపాధికి తీవ్ర ముప్పు
- రోడ్డున పడ్డ 500కు పైగా కుటుంబాలు
- వలసలకు సిద్ధమవుతున్న దళితులు

ప్రజాశక్తి - జామి

జిల్లాలో రోడ్డు మెటల్ క్వారీలు సంక్షోభంలో ఉన్నాయి. ప్రధానంగా ప్రభుత్వ మైనింగ్ విధానంతో సగానికి పైగా మూతబడ్డాయి. ఈ తరుణంలోనే గతేడాది జూలై నుంచి రాయల్టీ ప్రయివేటు విధానంతో ఉన్న వారి బతుకులు రోడ్డున పడ్డాయి. జామి మండల కేంద్రంలో మాధవరాయమెట్ట వద్ద క్వారీ కార్మికులకు ఉపాధి అవకాశాలు మెండుగా ఉండేవి. జామి గ్రామంలో ఒక్క దళిత కాలనీ నుంచి 100 కుటుంబాలకు పైగా సొసైటీ క్వారీలో పనులు చేసుకుని దశాబ్దాల నుంచి జీవనం సాగిస్తున్నారు. క్వారీ పనులు తప్ప మరే పనులు తెలియని దళిత కుటుంబాలకు ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రయివేటు విధానం పొట్ట కొట్టింది. దీంతో కార్మిక కుటుంబాలు చెల్లాచెదురైపోయిన పరిస్థితి నెలకొంది. కుటుంబం గడవక, ఇతర ఉపాధి మార్గాల కోసం వలసలు పోయేందుకు సిద్ధమవుతున్న పరిస్థితి. జామి దళిత కాలనీలోనే వందలాది కుటుంబాలు రోడ్డున పడుతున్నట్లు కార్మికులు గగ్గోలు పెడుతున్నారు. క్వారీ కార్మికులతో ఏర్పడ్డ మాధవరాయమెట్ట కాలనీ వాసులు ఇప్పటికే క్వారీ పనులు వదులుకుని, ఇతర పనులకు మరలిపోయారు. ఉన్న కొద్దిపాటి కార్మికులు కూడా అనారోగ్యంతో పూట గడవడం కోసం, పడరాని పాట్లు పడుతున్నారు. ఇలా ఒకప్పుడు కళకళలాడిన క్వారీలన్నీ నేడు వెలవెలబోతున్న పరిస్థితి. జిల్లా వ్యాప్తంగా క్వారీల ఆవాసాలను పరిశీలిస్తే, కార్మికుల దుర్భర పరిస్థితులు అర్థం చేసుకోవచ్చు.

సొసైటీ అనుమతులు ఇచ్చి ఆదుకోవాలి



చిన్న క్వారీలకు, మాలాంటి సొసైటీలకు ప్రభుత్వం విధానాలు పక్కన పెట్టి, అనుమతులు ఇవ్వాలి. కానీ కార్పొరేట్ వ్యాపారులకు మాత్రం మినహాయింపులు ఇచ్చి, క్వారీలు అప్పగిస్తున్నారు. ఇప్పటికైనా మాలాంటి పేద కుటుంబాల పట్ల ప్రభుత్వం దయ చూపాలి.

- మోయి లక్ష్మణ, క్వారీ కార్మికుడు

ఆత్మహత్యలే శరణ్యం



తాతలు తండ్రుల నుంచి క్వారీలను నమ్ముకుని బతుకున్న మాకు ప్రభుత్వ విధానం, ప్రయివేటు చెక్ పోస్టులు పొట్ట కొట్టాయి. చేసేందుకు పని లేదు. ఇల్లు గడవడం లేదు. దీంతో కుటుంబానికి కుటుంబాలు ఆత్మహత్యలు చేసుకోవడం తప్ప మరో మార్గం కనిపించడం లేదు.

- ఇప్పాక లక్ష్మి, దళిత కాలనీ, జామి

క్వారీ లేకపోతే ఎలా బతకాలి?



మా కాలనీలో సగానికి పైగా కుటుంబాలకు క్వారీలే జీవనాధారం. సొసైటీ పేరున మాకున్న క్వారీ అనుమతులు రెన్యువల్ కావడం లేదు. కానీ అనుమతులు లేని బడా బాబులు మాత్రం దర్జాగా తోలుకుంటు న్నారు. మొత్తానికి ప్రభుత్వ విధానాలు మా బతుకుల్ని గల్లంతు చేస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం యంత్రాంగం మాపట్ల దయ చూపాలి.

- బోని తాతారావు, క్వారీ కార్మికుడు

మద్దతుధరకు చట్టబద్ధత కల్పించాలి

ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు

ప్రజాశక్తి-బొబ్బిలి

రైతులు పండించే వ్యవసాయ ఉత్పత్తుల మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ డిమాండ్ చేశారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో ఆదివారం మద్దతుధరకు చట్టబద్ధత కల్పించాలని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు సింగిరెడ్డి గోపాలం అధ్యక్షతన ప్రజా, కార్మిక సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతుధర ఇవ్వకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. మద్దతుధర ఇవ్వాలని రైతులు పోరాటం చేస్తే గోడీ మీడియా మద్దతు ధర ఇవ్వడం సాధ్యం కాదని చెప్పడం అన్యాయమన్నారు. రైతులు పండించే వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర ఇవ్వాలంటే రూ.10 లక్షల కోట్లు ఖర్చు చేయాల్సి వస్తుందని గోడీ మీడియా వాదనలు చేయడం సబబు కాదన్నారు. వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధర ఇవ్వాలంటే రూ.21 వేల కోట్లు కేటాయిస్తే సరిపోతుందని చెప్పారు. మత్స్య, డెయిరీ పరిశ్రమలకు మద్దతుధర లేనప్పటికీ లాభాల్లో నడుస్తున్నాయని వాదనలు చేయడం దారుణమన్నారు. పంటలకు నష్టం జరిగితే బీమా ఇవ్వాలని కోరారు.

వ్యవసాయ నల్ల చట్టాలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించిన ప్రధాని మోడీ.. స్వామినాథన్ చెప్పినట్లు మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. విద్యుత్తు చట్ట సవరణ బిల్లు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. బిజెపి విధానాలకు వైసిపి, టిడిపి, జనసేన మద్దతు ఇవ్వడం ప్రజలకు ద్రోహం చేయడమేనని తేల్చిచెప్పారు.

14న ఢిల్లీ సభను జయప్రదం చేయాలి

రామ్‌లీలా మైదానంలో ఈ నెల 14న జరిగే రైతు సంఘాల మహా పడవో భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని మర్రాపు సూర్యనారాయణ కోరారు. ఢిల్లీ సభకు మద్దతుగా మండల, జిల్లా కేంద్రాల్లో ప్రదర్శనలు చేయాలని పిలుపునిచ్చారు. రైతు ఉద్యమానికి ప్రజలు మద్దతు ఇవ్వాలని రౌండ్ టేబుల్ సమావేశం కోరింది. సమావేశంలో రైతు సంక్షేమ సంఘం అధ్యక్షులు వేమిరెడ్డి లక్ష్మునాయుడు, ఎఐటియుసి జిల్లా నాయకులు ఎం.శ్రీనివాస్, సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు, పెన్షనర్ల సంఘం నాయకులు వి.శేషగిరిరావు, పి.కృష్ణ, రైతు సంఘం నాయకులు యు.భూషణ్, సాంబయ్య, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి మణికుమార్, తదితరులు పాల్గొన్నారు.

'పది' పరీక్షలకు సర్వం సిద్ధం

- ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు చర్యలు
- హాజరు కానున్న 23,827 మంది విద్యార్థులు
- 'ప్రజాశక్తి'తో డిఇఒ ఎన్.ప్రేమ్‌కుమార్ ముఖాముఖి



ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈ నెల 18 నుంచి 30వ తేదీ వరకు జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా విద్యా శాఖ అధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ తెలిపారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఈ వారం తనను కలిసిన 'ప్రజాశక్తి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు..

ఈ ఏడాది ఎంత మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు.?



ఈ ఏడాది పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు 23,827 మంది హాజరు కానున్నారు. వారిలో బాలురు 11946, బాలికలు 11881 మంది. ఇంగ్లీష్ మీడియంలో 15,706 మంది, తెలుగు మీడియంలో 8,121 మంది రాయనున్నారు.

ఎన్ని కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నారు.?

జిల్లా వ్యాప్తంగా 129 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నాం. ఎయిడెడ్, ఎపిఆర్‌ఎస్, బిసి సంక్షేమ శాఖ గురుకులం, గిరిజన గురుకులం ఒక్కొక్కటి, మోడల్ స్కూల్స్ 10, సాంఘిక సంక్షేమ గురుకులాలు 3, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు 8, ప్రయివేటు పాఠశాలలు 39, జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలు 60.. మొత్తం 129 కేంద్రాల్లో పరీక్షలు జరగనున్నాయి.

పరీక్షా కేంద్రాల్లో ఎటువంటి సౌకర్యాలు కల్పించారు.?

విద్యార్థులు ప్రశాంతమైన వాతావరణంలో పరీక్ష రాసుకునే విధంగా వెలుతురు, తాగునీరు, విద్యుత్ సౌకర్యం, మరుగుదొడ్లు, మెడికల్ సిబ్బందిని ఏర్పాటు చేశాం. 27 కేంద్రాల్లో ఫర్నీచర్ సౌకర్యం అరకొరగా ఉంటే వెంటనే ప్రత్యామ్నాయ చర్యలు తీసుకొని ఫర్నీచర్ ఏర్పాటు చేశాం. పరీక్షా కేంద్రాల వద్ద వేసవి కారణంగా తాగునీరు ఏర్పాటు చేయడంతో పాటు ఒఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాం.

ఎన్ని శాఖలు సహకారం అందిస్తున్నాయి.?

పరీక్షలు విజయవంతం కావడానికి ఇప్పటికే విద్యుత్, రెవెన్యూ, పోలీస్, రవాణా, వైద్య శాఖల సహకారం తీసుకుంటున్నాం. విద్యార్థులు హాల్ టికెట్ చూపిస్తే ఉచిత రవాణా సౌకర్యం కల్పిస్తారు. అన్ని రూట్లలో ఆర్‌టిసి బస్సులు విద్యార్థులకు అందుబాటులో ఉంటాయి.

పరీక్షా కేంద్రాల్లో మాస్ కాపీయింగ్, ఇతర ఇబ్బందులు తలెత్తకుండా తీసుకున్న చర్యలేమిటి.?

పరీక్ష కేంద్రాల వద్ద ఎటువంటి ఇబ్బందులూ లేకుండా 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. పరీక్షా కేంద్రాల చుట్టూ ఉన్న జిరాక్స్ షాపులకు నోటీసులు ఇచ్చాం. పరీక్షా సమయంలో వాటిని మూసేయాలి. మాస్‌కాపీయింగ్‌కు అవకాశం లేకుండా చర్యలు తీసుకున్నాం. 129 మంది సిట్టింగ్ స్క్వాడ్, 129 డిపార్ట్‌మెంట్ అధికారులు, 6 ఫ్లయింగ్ స్క్వాడ్, 1409 మంది ఇన్విజిలేటర్లను నియమించాం.

ఈ ఏడాది ఫలితాలు ప్రభుత్వ పాఠశాలల్లో ఎలా ఉండనున్నాయి.?

పదో తరగతిలో గతేడాది కంటే మెరుగైన ఫలితాలు వస్తాయని ఆశాభావంతో ఉన్నాం. సకాలంలో సిలబస్ పూర్తి చేసి రివిజన్ తరగతులు ఏర్పాటు చేశాం. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి ఉత్తీర్ణతా శాతం పెంచేందుకు చర్యలు తీసుకున్నాం.

ప్రశ్నపత్రాలు ఎన్నిచోట్ల భద్రపరిచారు? ఎన్ని రూట్లలో పంపిణీ చేయనున్నారు.?

పదో తరగతి ప్రశ్నపత్రాలను 29 పోలీస్‌స్టేషన్లలో స్టోరేజ్ పాయింట్లలో ఉంచాం. వాటిని పరీక్షా కేంద్రాలకు 9 రూట్లలో ప్రశ్నపత్రాలు తరలించేందుకు చర్యలు తీసుకున్నాం.

విద్యార్థులకు ఏమైనా సూచనలు.?

ప్రతిరోజూ ఉదయం 9.30 గంటల నుంచి 12 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. ప్రతి విద్యార్థి పరీక్షా కేంద్రానికి 8.30 గంటలకు చేరుకోవాలి. పరీక్ష ప్రారంభమైన అరగంట వరకు సమయం ఉంటుంది. ఒకే విద్యార్థి రెండు రోజులు అదే అరగంట ఆలస్యంగా వస్తే మూడో రోజు పరీక్షకు అనుమతించేది లేదు.

నేడు స్పందన రద్దు

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే స్పందన ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమం రద్దు చేసినట్లు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. అర్జీదారులు ఈ విషయాన్ని గుర్తించాలని కోరారు.

రజకులపై దాడులు అరికట్టాలి


ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన రజకులపై దాడులు అరికట్టాలని ఎపి రజక సంఘం జిల్లా అధ్యక్షులు టి.భాస్కరరావు డిమాండ్ చేశారు. ఆదివారం నగర పరిధిలో విటి అగ్రహారం వద్దనున్న శ్రీ పైడిమాంబ రజక సేవా సంఘం ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనతోపాటు కార్యదర్శి జంపా చిన్న మాట్లాడుతూ రజకుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిన తీరు బాధాకరమన్నారు. రజకుల అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవడంలో కనీస ప్రయత్నాలు చేయడం లేదన్నారు. రజకులను ఎస్‌సి జాబితాలో చేర్చాలని కోరారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు షీలా తాతారావు, గోవిందు, జాయింట్ సెక్రెటరీ రాజు రమణ, సభ్యులు గురునాయుడు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలేకి ఘన నివాళి

ప్రజాశక్తి-విజయనగరంకోట

సావిత్రిబాయి పూలే వర్ధంతి కార్యక్రమాన్ని గాజులరేగలోని నారాయణ పబ్లిక్ స్కూల్లో ఆదివారం నిర్వహించారు. సావిత్రిబాయి చిత్రపటానికి స్కూల్ కరస్పాండెంట్ మొయిద నారాయణరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నారాయణ రావు మాట్లాడుతూ నిమ్నవర్గాల అభ్యున్నతికి కృషిచేసిన మహిళామణి సావిత్రిబాయి అని కొనియాడారు. కుల మతాలకు అతీతంగా స్త్రీ విద్యకు పాఠశాలలను స్థాపించి మొట్టమొదటి ఉపాధ్యాయురాలుగా పేరొందారన్నారు.



టిడ్కో ఇళ్ల పట్టాలను అందజేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

టిడ్కో ఇళ్లు పంపిణీ


ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అన్ని సదుపాయాలతో లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లు అందివ్వడం ప్రభుత్వ దార్శనికతకు నిదర్శనమని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి అన్నారు. ఆదివారం సోనియా నగర్ లో 672 మంది లబ్ధిదారులకు టిడ్కో ఇళ్ల పత్రాలను, ఇంటి తాళాలను అందజేశారు. తొలుత మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలలోపే టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు అందివ్వడానికి ఎంతగానో కృషి చేశామన్నారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, కమిషనర్ ఎం.ఎం.నాయుడు, ఫ్లోర్ లీడర్ ఎస్‌వివి రాజేష్, వైసిపి నగర అధ్యక్షులు ఆశపు వేణు, సహాయ కమిషనర్ తిరుమలరావు, హౌసింగ్ కమిటీ సభ్యులు మారోజు శ్రీనివాసరావు, గాదం మురళి, కార్పొరేటర్లు అల్లు చాణిక్య, కనకల నాగవల్లి, పట్టా ఆదిలక్ష్మి, ఇసరపు రేవతి దేవి, మీసాల రమాదేవి పాల్గొన్నారు.

మహిళా సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

మహిళా సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి తెలిపారు. మౌంట్ ఫోర్ట్ సోషల్ ఇనిస్టిట్యూట్ , ప్రజ్వల సంఘం స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో మహిళా సాధికార సదస్సును జెడ్‌పి సమావేశ మందిరంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా భద్రత కోసం నిరంతరం ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. శ్రామిక మహిళల అభ్యున్నతిగా పనిచేస్తున్న వారిని ఈ సందర్భంగా సత్కరించారు. కార్యక్రమంలో నేషనల్ క్యాంపెయిన్ ఆన్ దళిత్ హ్యూమన్ రైట్స్ రాష్ట్ర కన్వీనర్ పి.చిట్టిబాబు, సీనియర్ న్యాయవాది వి.రత్నకుమారి, ప్రజల సంస్థ ప్రతినిధి పి.సుదీప, డొమెస్టిక్ వర్కర్స్ ఫెడరేషన్ ప్రతినిధి కోరుకొండ వరలక్ష్మి, రాష్ట్ర కమిటీ సభ్యురాలు సిహెచ్ స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి పాలనలో అధోగతిపాలు



ప్రచారం చేస్తున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి అదితి

ప్రజాశక్తి-విజయనగరం కోట

వైసిపి పాలనలో రాష్ట్రం అధోగతిపాలైందని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పి.అదితి గజపతిరాజు తెలిపారు. నగరంలోని 50వ డివిజన్ పరిధిలో ఉన్న వైఎస్‌ఆర్ నగర్‌లో ఆదివారం ఆమె ప్రచారం చేపట్టారు. టిడిపి సూపర్ సిక్స్ హామీలను ప్రజలకు వివరించారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టిడిపి - జనసేన ప్రభుత్వం ఏర్పడాలని ప్రజలకు తెలియజేశారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, మండల అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలినాయుడు, కార్యాలయ కార్యదర్శి రాజేష్ బాబు, బిసి నాయకులు వేచలపు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కోచింగ్ సెంటర్లకు వెళ్లి..

మై ఫస్ట్ ఓట్ ఫర్ సిబిఎన్ కార్యక్రమంలో భాగంగా కోచింగ్ సెంటర్లకు టిఎన్‌ఎస్‌ఎఫ్, తెలుగు యువత సభ్యులు వెళ్లి, వారి సమస్యలను తెలుసుకున్నారు. యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందాలంటే చంద్రబాబును సిఎంను చేయాలని కోరారు.


ఎమ్‌పికి వినతి పత్రాన్ని అందిస్తున్న పోరాట కమిటీ సభ్యులు

సుప్రీంకోర్టు తీర్పు అమలు చేయాలి

ప్రజాశక్తి- చీపురుపల్లి

ఇపిఎఫ్ పెన్షన్‌కు సంబంధించి సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుని అమలు చేయాలని పోరాట్ కమిటీ సభ్యులు అంబళ్ల గౌరినాయుడు ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్‌ని కోరారు. ఈ మేరకు ఆదివారం కమిటీ సభ్యులు ఎంపిని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ప్రధానంగా ఇపిఎఫ్ పెన్షన్ 7,500 ఇవ్వాలని కోరారు. 2014లో సుప్రీం కోర్టు హైయర్ పెన్షన్ కోసం ఇచ్చిన తీర్పుని యధాతధంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉచిత మెడికల్ సదుపాయం కల్పించాలని ఈ విషయం దేశ వ్యాప్తంగా ఉన్న ఎంపీలందరికీ యాజిటేషన్ కమిటీ వినతి పత్రాలను అందజేసే ప్రక్రియలో ఉందని వారు తెలిపారు. అందులో భాగంగానే ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్‌కి వినతిని అందజేసామని అన్నారు. ఎంపిని కలిసిన వారిలో యాజిటేషన్ కమిటీ సభ్యులు జె విశ్వనాధ రాజు, ఏఎస్ఎన్ మూర్తి, బి జగదీష్, కంది రామారావు, పి.ఉమా, గంట్యాడ అప్పలరాజు, పి శంకరరావుపట్నాయక్, ఎం.వాసురాజు, వైగాళ సత్యం తదితరులున్నారు.

రాష్ట్ర ప్రయోజనాల కోసమే కూటమి

శృంగవరపుకోట: రాష్ట్ర ప్రయోజనాల కోసమే టిడిపి, జనసేన, బిజెపి కూటమి ఏర్పాటు చేయడంలో పవన్ కళ్యాణ్ కీలక పాత్ర పోషించారని జనసేన పార్టీ నియోజకవర్గ నాయకులు వబ్బిన సన్యాసినాయుడు అన్నారు. జనసేన పార్టీ అధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని ఆర్‌కె కళ్యాణమండపంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో నియోజకవర్గంలో జనసేన పార్లమెంట్ అభ్యర్థికి గాజు గ్లాసు గుర్తుకు 16,680 ఓట్లు వచ్చాయని ఇది విజయనగరం జిల్లాలో అన్ని నియోజకవర్గాల జనసేన ఓట్లకన్నా ఎక్కువ బలమున్న నియోజకవర్గంగా నిరూపితమయిందని గుర్తు చేశారు. ఎస్.కోట నియోజకవర్గ ఎమ్మెల్యే టికెట్ జనసేనకు కేటాయించాలని తమ పార్టీ అధిష్టానాన్ని కోరుతున్నామన్నారు. కూటమిలో ఏ పార్టీకి టికెట్ కేటాయించినా కూటమి అభ్యర్థి గెలుపు కోసం జన సైనికులు అందరం సమిష్టిగా కష్టపడి పనిచేస్తామని తీర్మానించుకున్నామన్నారు. ఈ సమావేశంలో నాయకులు కొట్యాడ లోకాభిరామ, సుంకర అప్పారావు, గొరపల్లి రవికుమార్, జామి వర్మ రాజు, రమేష్ శివాజీ, అలమంద రాంబాబు, జొన్నపల్లి సత్తిబాబు, దేగల ఈశ్వర్‌రావు, ఐదు మండలాల జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

'కాంట్రాక్టు ఉద్యోగుల కల నెరవేరింది'


పోస్టింగ్ ఆర్డర్లు ఇస్తున్న డిఎంహెచ్ఓ

కొత్తవలస: కాంట్రాక్టు ఉద్యోగులకు ప్రభుత్వం ఇచ్చిన హామీ నెరవేర్చడంతో వారి కల నెరవేరిందని కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం నాయకులు ప్రసాదరావు, సత్యారావు తెలిపారు. 2,146 మందిని వైద్య ఆరోగ్యశాఖలో రెగ్యులర్ చేస్తూ మార్చి 7న ప్రిన్సిపల్ సెక్రటరీ ఎమ్‌టి కృష్ణబాబు జిఒ జారీ చేశారని 9న జిల్లా వైద్య ఆరోగ్య శాఖధికారి ఎస్. భాస్కరావు మన జిల్లాలో 78 మంది హెల్త్ అసిస్టెంట్స్‌కి, 12 మంది ల్యాబ్ టెక్నీషియన్స్, 10 మంది ఏఎన్ఎమ్స్‌కి, 18 మంది ఫార్మసిస్ట్‌కి కెవిఎరా రాత్రి రెగ్యులర్ పోస్టింగ్ ఆర్డర్స్ ఇవ్వడంతో తెలిపారు. కోర్ట్ కేసులు పెండింగ్ నెపంతో రాష్ట్రం మొత్తం ఇంకో వెయ్యి మంది హెల్త్ అసిస్టెంట్స్ రెగ్యులర్ కాక ఉండిపోయారని వారిని కూడా రెండో ఫేజ్‌లో రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు.

సంక్షేమ పథకాలపై ప్రచారం

డెంకాడ: గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు గురించి వివరించాలని వైస్ ఎంపిపి తమ్మినాయుడు తెలిపారు. మండలంలోని చింతలవలస సచివాలయంలో ఆదివారం ఆయన సచివాలయ కన్వీనర్లు, వార్డు మెంబర్లు, గృహ సారథులు, వాలంటీర్లతో సమావేశమయ్యారు. రాబోయే ఎన్నికల్లో మళ్లీ సిఎం జగన్మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలన్నారు.

పలు చోట్ల సావిత్రిబాయి పూలే వర్ధంతి

ప్రజాశక్తి - వేపాడ

మండల కేంద్రంలో సావిత్రిబాయి పూలే 127వ వర్ధంతిని మండల దళిత మహాసభ అధ్యక్షులు కొమానపల్లి రాము ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం ఆమె సావిత్రిబాయి పూలే సేవలను కొనియాడారు. కార్యక్రమంలో దళిత సంఘ నాయకులు గుత్తి శ్రీను, వీరేశ్, కె.పార్వతి, కె. అప్పారావు, ఆర్. దేముడుబాబు, జవార్ తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట: మహిళల చదువుల కోసం నిరంతరం పాటుపడిన మహిళ చైతన్య మూర్తి సమాజంలో రుగ్మతలు రూపుమాపడానికి విశేష కృషి చేసిన సామజిక ఉద్యమకారిణి సావిత్రిబాయి పూలే అని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ వబ్బిన సత్యనారాయణ అన్నారు. సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా ఆమెకు పట్టణంలో ఘన నివాళులు అర్పించారు. ముందుగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం పూలే మహిళల చదువుల కోసం చేసిన కృషిని గుర్చి పలువురు మాట్లాడారు.

జనసేనలో చేరికలు

ప్రజాశక్తి - భోగాపురం


నెల్లిమర్ల: పార్టీలో చేరిన వారితో మాధవి

జనసేన పార్టీలో ఆదివారం సాయంత్రం నియోజకవర్గం ఇంచార్జి లోకం మాధవి ఆధ్వర్యంలో భారీగా చేరికలు జరిగాయి. భోగాపురం గ్రామానికి చెందిన ఇద్దరు వార్డు మెంబర్లతో పాటు పల్లంట్ల శ్రీనివాసరావు, పల్ల శ్రీనివాసరావు, మాజీ వైస్ ఎంపిపి భర్త సుధాకర్, గుండపు సూరిబాబు, ముక్కాం గ్రామానికి చెందిన వైసిపి ఎంపిటిసిగా పోటీ చేసి ఓడిపోయిన అభ్యర్థి మైలపల్లి అప్పలకొండ పార్టీలో చేరారు. వారికి లోకం మాధవి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు లోకం ప్రసాద్, పల్లంట్ల జగదీష్, పల్ల రాంబాబు పాల్గొన్నారు.

నెల్లిమర్ల : మండలంలోని మిమ్స్ ఉద్యోగి అట్టాడ మహేష్ ఆధ్వర్యంలో కొండవెలగాడ గ్రామానికి చెందిన వైసిపి కార్యకర్తలు ముంజేరు జనసేన పార్టీ కార్యాలయంలో జనసేన పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. డెంకాడ మండలం జొన్నాడ పంచాయతీకి చెందిన సుమారు 25 కుటుంబాలు జనసేనలో చేరాయి.

మిమ్స్ ఉద్యోగులు పోరాడి సాధించుకోవాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి


మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు

మిమ్స్ ఉద్యోగులు, కార్మికులు పోరాటాన్ని కొనసాగించి సమస్యలకు పరిష్కారం సాధించుకోవాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.హెచ్. నర్సింగరావు పిలుపునిచ్చారు. స్థానిక ఆర్‌ఒబి వద్ద మిమ్స్ ఉద్యోగులు, కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గత 39 రోజులుగా చేస్తున్న నిరశన శిబిరాన్ని ఆయన ఆదివారం సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిమ్స్ యాజమాన్యం గత మూడు సంవత్సరాలుగా చేస్తున్న కక్ష సాధింపు చర్యలు, వేధింపులు, దుర్మార్గాలకు విసిగి వేసారిపోయి బానిసలుగా బతకలేక ఉద్యోగులు, కార్మికులు బయటకు వచ్చి సిఐటియుని ఆశ్రయించారన్నారు. సిఐటియుకి రెచ్చగొట్టే అవసరంలేదని ఉద్యోగులు, కార్మికులు సిఐటియు తలుపు తడితేనే పోరాటానికి వచ్చిందని గుర్తు చేశారు. ఓపికతో పోరాటం చేస్తే సమస్య పరిష్కారమవుతోందని చెప్పారు. అంగన్ వాడీలు, సమగ్ర శిక్ష ఉద్యోగులు చేసిన పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని, అధికార్లు, ప్రజాప్రతినిధులు యాజమాన్యాలకు కొమ్ము కాస్తాయని గుర్తుంచుకోవాలని తెలిపారు. ఎమ్మెల్యే సాక్షిగా సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు కాబట్టి మిమ్స్ ఉద్యోగులు, కార్మికులకు 7డిఎ బకాయిలు, వేతన ఒప్పందం చేసి జనవరి నెల జీతాలు చెల్లించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను అనుసరించడం వల్ల ఇలాంటి పరిస్థితులు ఏర్పడ్డాయని ఉద్యోగులు, కార్మికులు ఐక్యంగా పోరాడితే యాజమాన్యాలు, ప్రభుత్వాలు తోక ముడిచి పారిపోతాయని తెలిపారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఆర్.మోహన్ రావు, రాష్ట్ర నాయకులు డి.రాము, జిల్లా ప్రధాన కార్యదర్శి కెవిఆర్‌కె ఈశ్వర రావు, జిల్లా అధ్యక్షులు రమేష్ చంద్ర పట్నాయక్ శిబిరానికి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, మిమ్స్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు టి.వి. రమణ, సిఐటియు జిల్లా కమిటి సభ్యులు కిల్లంపల్లి రామారావు, ఉద్యోగులు ఎం.నారాయణ, కె.మధు, ఎం. నాగభూషణం, బంగారునాయుడు, మూర్తి, గౌరి, వర లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భవనాలను ప్రారంభించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి- శృంగవరపుకోట


రామభద్రపురం: శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

మండలంలోని గోపాలపల్లి గ్రామంలో సచివాలయం, విలేజ్ హెల్త్ క్లినిక్ సెంటర్ భవనాలను, ఎస్ కోట- తలారి గ్రామంలో సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం పల్లె ప్రజలకు అందించాలనే సంకల్పంతో జగనన్న సచివాలయ వ్యవస్థను స్థాపించారన్నారు. ప్రతి గ్రామంలో సచివాలయ భవనాన్ని నిర్మించి వాలంటీర్ వ్యవస్థ ద్వార అవినీతికి ఆస్కారం లేకుండా సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువ చేయడం లక్ష్యంగా ప్రభుత్వ పనిచేస్తోందన్నారు. కులం, మతం, పార్టీతో సంబంధం లేకుండా అర్హత ఉన్న ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైసిపి ప్రభుత్వం అని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫోక్ అండ్ కల్చరల్ డైరెక్టర్ వాకాడ రాంబాబు, వైస్ ఎంపిపి పినిశెట్టి వెంకటరమణ, వైసిపి మండల అధ్యక్షులు మోపాడ కుమార్, పోతనపల్లి సర్పంచ్ కూనిరెడ్డి వెంకటరావు, గోపాలపల్లి తగరంపూడి రమణ, ఎంపిటిసి గుమ్మడి సన్యాసప్పాడు, జుత్తాడ సూర్యారావు, ఎలమంచిలి ఈశ్వరరావు, వసి బంగారునాయుడు, మోపాడ కోటి, కొట్టం వెంకటరావు, సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

రామభద్రపురం: మండలంలోని కొట్టక్కి పంచాయతీలోని కొత్త ఎరుకులపాకలు గ్రామంలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 5లక్షలతో 10వేల లీటర్ల సామర్థ్యం గల నూతన వాటర్ ట్యాంక్‌ను ఎమ్మెల్యే శంబంగి వెంకటచినప్పలనాయుడు ఆదివారం ప్రారంభించారు. ట్యాంక్ నిర్మాణానికి ఉచితంగా స్థలాన్ని దానం చేసిన నారాయణమ్మను అభినందించారు. అనంతరం కొట్టక్కి గ్రామంలో రైతులు పొలాలకు వెళ్లేందుకు రహదారి సౌకర్యం కల్పించడం కోసం గ్రావెల్ రోడ్లు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. జల జీవన్ మిషన్ పథకంలో భాగంగా రూ.5 లక్షలతో నూతనంగా నిర్మించబోయే మినీ వాటర్ ట్యాంక్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఇదే గ్రామంలోని ఎస్‌సి కాలనీలో సిసి రోడ్, డ్రైనేజీలు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి చొక్కాపు లక్ష్మణరావు, వైసిపి మండల అధ్యక్షుడు అప్పికొండ లక్ష్మునాయుడు, వైసిపి మహిళా విభాగం జిల్లా కార్యదర్శి సామాంతుల నిర్మల, జెడ్‌పిటిసి అప్పికొండ సరస్వతి, సర్పంచ్ అప్పికొండ అనురాధ, ఎంపిటిసి సామిరెడ్డి రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

వైసిపికి కాకర్లపూడి రాజీనామా

- పార్టీలో సముచిత స్థానం లభించకేనని వెల్లడి
- పవన్ సమక్షంలో జనసేన పార్టీలో త్వరలో చేరిక.!

ప్రజాశక్తి - భోగాపురం


రాజీనామా చేస్తున్నట్లు ప్రకటిస్తున్న శ్రీనివాసరాజు

వైసిపికి ఆ పార్టీ నాయకుడు కాకర్లపూడి శ్రీనివాసరాజు ఆదివారం సాయంత్రం రాజీనామా చేశారు. ఆయనతోపాటు భోగాపురం, ముక్కాం, ముంజేరు, దిబ్బల పాలెం గ్రామానికి చెందిన పలువురు పార్టీకి రాజీనామా చేశారు. ఈ సందర్భంగా భోగాపురంలో ఆయన ఇంటి వద్ద ఉన్న కార్యాలయంలో అభిమానులను ఉద్దేశించి మాట్లాడారు. జగన్మోహన్ రెడ్డి పార్టీ స్థాపించినప్పటి నుంచి ఉన్నప్పటికీ సముచిత స్థానం ఇవ్వలేదన్నారు. స్థానిక ఎమ్మెల్యే బడ్డు కొండ అప్పలనాయుడు పార్టీ నాయకులను, కార్యకర్తలను కనీసం పట్టించుకోవడం లేదన్నారు. విమానాశ్రయం నిర్మాణంలో భూములు ఇచ్చిన రైతులకు పరిహారం అందక ఇబ్బంది పడినప్పటికీ స్థానిక ఎమ్మెల్యే ఏనాడు పట్టించుకోలేదని విమర్శించారు. బడ్డుకొండ అనకొండగా తయారై ఎక్కడ చూసినా అవినీతికి అడ్డాగా మారారని ఆరోపించారు. క్వారీల పేరుతో కొండలను దోచుకుంటున్నారన్నారు. ఆయన ఓటమి లక్ష్యంగా పనిచేయడం జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే అప్పలనాయుడు పట్ల ప్రతి ఒక్కరూ విసుగు చెందుతున్నారని అటువంటి నాయకుడి దగ్గర పనిచేసే కంటే వేరే పార్టీలోకి వెళ్లడం శ్రేయస్కరమని అంతా ఆలోచించే భోగాపురం చుట్టుపక్కల గ్రామాలకు చెందిన మహిళలు, కార్యకర్తలు, అభిమానులు మూకుమ్మడిగా రాజీనామా చేసినట్లు తెలిపారు. తాను, తన అనుచరులంతా కలిసి తమ సత్తా ఏమిటో రాబోయే ఎన్నికల్లో చూపిస్తామని సవాల్ విసిరారు. తన భవిష్యత్తు కార్యాచరణ త్వరలో మళ్లీ ప్రకటిస్తానని ఆయన వెల్లడించారు. అయితే ఆయన పవన్ సమక్షంలో జనసేనలో చేరేందుకు సిద్ధమవుతున్నారని నాయకులు చర్చించుకున్నారు. ఆయన వెంట పల్లంట్ల శ్రీనివాసరావు, లాయర్ సుధాకర్, మాజీ సర్పంచ్ మైలపల్లి అప్పలకొండ, మండల మాజీ ఉపాధ్యక్షులు బాలి పల్లి సత్తిబాబు, యాదవ సంఘం నాయకులు బమ్మిడి నర్సింగ్‌రావుతో పాటు పలువురు పాల్గొని రాజీనామాలు ప్రకటించారు.

పార్టీ పరిస్థితులపై ఎమ్మెల్యే సమీక్ష

పార్టీ పరిస్థితులపై మండలంలోని వివిధ పంచాయతీలకు చెందిన నాయకులు, సర్పంచులు ఎంపిటిసి లతో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ఆదివారం భోగాపురంలో సమీక్షించారు. మండలంలోని 22 పంచాయతీలకు చెందిన వారితో మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ అధికారంలోకి రావాలంటే ఏం చేయాలనే దానిపై వివరించారు. ఈ సమావేశంలో వైసిపి మండల అధ్యక్షులు ఉప్పాడ సూర్యానారాయణ రెడ్డి, హౌసింగ్ బోర్డ్ డైరెక్టర్ ఉప్పాడ శివారెడ్డి, మండల జెసిఎస్ కన్వీనర్ యర్రప్పల నారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఆక్రమిత స్థలాన్ని పోరాడి సాధించాం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పుణ్యగిరి గెడ్డలో కులవృత్తిని చేస్తూ జీవనం సాగిస్తున్న రజకులకు చెందిన స్థలాన్ని ఆక్రమణదారుల నుంచి పోరాడి తిరిగి సాధించుకున్నామని రజక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రేగలబంద చిట్టిబాబు, యు.సూరిబాబులు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలోని శివాలయం వెనుకన గల పుణ్యగిరి గెడ్డలో తాత తండ్రుల నుంచి కులవృత్తిని చేస్తూ జీవనం సాగిస్తున్న రజకులకు చెందిన స్థలాన్ని కొంతమంది స్థానికులు ఆక్రమించి నంద నుయ్యి లను పూడ్చివేసి బట్టలు ఉతుకుతున్న స్థలంలో ఫెన్సింగ్ వేసి రజకుల కులవృత్తికి ఆటంకంపరిచారని, సుమారు రెండు సంవత్సరాలు పాటు రజకులు పోరాటం చేశామని గుర్తు చేశారు. జిల్లా అధికారులతో పాటు స్థానిక నాయకులకు, అధికారులకు విన్నవించుకున్నప్పటికీ ఫలితం లేకపోవడంతో తమకు జీవనోపాధి కల్పించే స్థలాన్ని తిరిగి అప్పగించాలంటూ రజకులు పెద్ద ఎత్తున పోరాటాలు చేశారన్నారు. సమస్య వాస్తవమని గ్రహించిన అధికారులు ఎట్టకేలకు రజకులకు చెందిన స్థలాన్ని స్వాధీనం చేసుకుని తిరిగి అప్పగించడంతో రజకులు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. వారు బట్టలు ఉతుక్కునే నంద నుయ్యి తిరిగి నిర్మించి ఇవ్వడంతో రజక సంఘం తరపున అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో ముఖ్య సలహాదారు జె. బంగారయ్య, సంగం పెద్ద గంధవరపు సన్యాసిరావు, బి చిన్న పైడి నాగరాజు, గంధవరపు అప్పలకొండ మండల రజకులు తదితరులు పాల్గొన్నారు.

జరజాపుపేటలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి- నెల్లిమర్ల

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జరజాపుపేట నగర పంచాయతీకి చెందిన సాధన యువజన సంఘం ఆదివారం గ్రామంలో స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని నిర్వహించింది. నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, అలుమల్లు మాధవి మాట్లాడుతూ సామాజిక సేవలో చొరవ తీసుకుని నవ సమాజ నిర్మాణానికి ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ తద్వారా కుటుంబానికి యువత ఆదర్శంగా ఉండాలి అని అన్నారు. మహిళా దినోత్సవ వేడుకల్లో సాధన యువజన సంఘం ప్రత్యేకంగా దృష్టి సారించి జిల్లా ప్రభుత్వ బ్లడ్ బ్యాంక్ రక్తదానం చేయడం విశేషం అని సాధన సేవలను అలుమల్లు మాధవి కొనియాడారు. ఈ కార్యక్రమంలో పెద్దలు తాలాడ సన్నిబాబు, ఉపాధ్యాయులు భోలే రమణారావు, మద్దిల సన్యాసిరావు, మద్దిల సత్యనారాయణ, కడలి రమేష్, హరి మోహన్, కొత్తల శంకర్రావు, సాధన అధ్యక్షులు పోలుభోతు దుర్గాప్రసాద్, ప్రధాన కార్యదర్శి పసుమర్తి వెంకటరమణ, సభ్యులు తుమ్ము అశోక్, హరి రాజారావు, కనకల సురేంద్ర, మద్దిల ఉమా, పడాల హరికృష్ణ, చాపా హరి, కళ్యాణ్ పాల్గొన్నారు

రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి

ప్రజాశక్తి- జామి

మండలంలోని కుమరాం గ్రామ పరిధిలో కెజిబివి స్కూల్ ఎదురుగా ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి చెందాడు. పోలీసులు అందించిన వివరాల మేరకు.. కుమరాం గ్రామానికి చెందిన దేవ సన్యాసిరావు, రాజ్యలక్ష్మి దంపతుల కుమారుడు దేవ రాకేష్(14) కుమరాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వతగరతి చదువుతున్నాడు. ఆదివారం కుమరాం గ్రామంలో తన చిన్నాన్న కుమార్తె (చెల్లెలు) శుభకార్యం నిమిత్తం అందరితో ఆనందంగా గడిపాడు. సాయంత్రం సమయంలో స్కూటీని తీసి విజయనగరం రహదారి వైపు వెళ్లాడు. కెజిబివి స్కూల్ ఎదురుగా వచ్చేసరికి ఎదురుగా కుక్క అడ్డం రావడంతో సడన్‌గా బ్రేక్ వేసాడు. వెంటనే బైక్ అదుపు తప్పి కిందకు పడిపోయాడు. ఈ ప్రమాదంలో రాకేష్ తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనా సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, స్థానికులు అక్కడకు చేరుకుని కన్నీరు మున్నీరుగా విలపించారు. శుభకార్యం జరిగిన రోజే ఆ కుటుంబలో ఇంతటి విషాదం జరగడంతో చూపరులు సైతం కంటతడి పెట్టించింది. ఎస్ఐ వీరబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేరాలు ఘోరాలు

కార్మికునికి గాయాలు

లక్కవరపుకోట: మండలంలోని జమ్మాదేవిపేట జంక్షన్ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కార్మికుడకు గాయాలయ్యాయి. క్షతగాత్రకుడు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గంట్యాడ మండలం బోనంగి గ్రామానికి చెందిన గండ్రెడ్డి దేవ విశాఖ స్టీల్ ప్లాంట్ పరిశ్రమలో కార్మికుడుగా విధులు నిర్వహిస్తున్నాడు. నైట్ డ్యూటీ ముగించుకుని తన గ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా జమ్మాదేవిపేట జంక్షన్ వద్దకు వచ్చేసరికి అడ్డంగా ఆవు రావడంతో ద్విచక్ర వాహనం అదుపుతప్పి తానంతట తాను పడిపోయాడు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ఎల్ కోట 108 వాహనం హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని పి హెచ్‌సికి తరలించారు. కార్మికుడు దేవాకు నోరు, ముక్కు భాగంలో బలమైన గాయాలయ్యాయి. వైద్యులు ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం విశాఖకు తరలించారు.

పూరిల్లు దగ్ధం

గంట్యాడ: మండలంలోని బురదపాడు బిసి కాలనీకి చెందిన పెంటపోన అర్జున్ పూరిగుడిసే ఆదివారం దగ్ధమైంది. ఈ ప్రమాదంలో రూ.80 వేల విలువ చేసే వస్తువులు కాలిపోయాయని రెవెన్యూ సిబ్బంది అంచనా వేశారు. రెవెన్యూ అధికారి లావణ్య వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని ప్రాథమిక నివేదికను అందజేశారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టిలో పెడతామని తహశీల్దార్ నీలకంఠేశ్వర్ తెలిపారు.

జూదరులపై కేసు నమోదు

రామభద్రపురం: మండల పరిధిలోని చందాపురం శివారు తోటల్లో పేకాట ఆడుతున్న 4గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.18వేలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జ్ఞాన ప్రసాద్ తెలిపారు. ఈ దాడిలో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కళా ప్రదర్శన

ప్రజాశక్తి- బొబ్బిలి

స్థానిక సింగారపువీధిలో ఉన్న శ్రీవైభవ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ఆనందోబ్రహ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన కళా ప్రదర్శన ఆకట్టుకుంది. మహాశివరాత్రి సందర్భంగా ఆలయంలో ఆనందోబ్రహ్మ గ్రూపు సభ్యులు భక్తి పాటలు పాడి కోలాటం నిర్వహించారు. చిన్నారులు చేసిన కోలాటం ఆకట్టుకుంది. కళా ప్రదర్శన నిర్వహించిన చిన్నారులను ఆలయ ధర్మకర్త గెంబలి శ్రీనివాసరావు, ఆనందోబ్రహ్మ వ్యవస్థాపకులు మింది విజయమోహన్ అభినందించారు. కార్యక్రమంలో సభ్యులు పాల్గొన్నారు.


మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న బేబినాయన

మాస్టర్‌కు కన్నీటి వీడ్కోలు

బొబ్బిలి: ఈ నెల 8న విశాఖపట్నంలో ఒక ఆస్పత్రిలో గుండెపోటుతో మరణించిన విశ్రాంత ఉపాధ్యాయులు డొకల రాములు మాస్టర్‌కు అభిమానులు, ఉపాధ్యాయ సంఘ నేతలు, కుటుంబ సభ్యులు ఆదివారం కన్నీటి వీడ్కోలు పలికారు. రాములు పార్థివదేహాన్ని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, టిడిపి నియోజకవర్గ ఇంచార్జి బేబినాయన, ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, వైసిపి నాయకులు శంబంగి వేణుగోపాల నాయుడు, మున్సిపల్ చైర్మన్ సావు మురళి, ఎపిటిఎఫ్, యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు, శిష్యులు సందర్శించి నివాళులర్పించారు. రాములు పార్థివదేహాన్ని ఇంటి నుంచి భైరిసాగరం శ్మశాన వాటిక వరకు ర్యాలీగా వెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు.


వేపాడ: పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ప్రశాంతంగా ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి - వంగర

మండలంలోని మడ్డువలస బి.ఆర్ అంబేద్కర్ గురుకులంలో ఆదివారం ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా నిర్వహించారు. 5వ తరగతికి సంబంధించి 144 మంది విద్యార్థులు హాజరు కావలసి ఉండగా 92 మంది విద్యార్థులు హాజరయ్యారని, ఇంటర్మీడియట్‌కు సంబంధించి 114 మంది విద్యార్థులు హాజరు కావలసి ఉండగా 94 మంది విద్యార్థులు హాజరైనట్లు చీఫ్ సూపరింటెంట్ ఎస్ పద్మజ తెలిపారు. ఈ పరీక్షలను ఎంఇఒ వై దుర్గారావు, డిఒ శేషగిరి పరిశీలించారు.

వేపాడ: మండలంలోని బక్కునాయుడుపేట గురుకుల పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగిందని ప్రిన్సిపాల్ టిఎం ఫ్లోరెన్స్ తెలిపారు. అబ్జర్వ్‌గా కొప్పెర్ల గురుకుల పాఠశాలలో పిజిటి మాథ్స్‌గా పనిచేస్తున్న ఎస్.మాధవరావు వ్యవహరించారు. 5వ తరగతి ప్రవేశ పరీక్షకు 235 మందికి గాను 205 మంది, ఇంటర్ ప్రవేశానికి 146 మందికి గాను 122 మంది హాజరై పరీక్ష రాశారన్నారు. పరీక్ష కేంద్రాన్ని మండల విద్యాశాఖాధికారి బాలభాస్కర్ పరిశీలించినట్లు ఆమె తెలిపారు.


క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న నాయకులు

చందులూరులో క్రికెట్ పోటీలు

ప్రజాశక్తి - లక్కవరపుకోట

మండలంలోని చందులూరులో ఈనెల 20న జరగనున్న శ్రీయర్రయమ్మ పేరంటాలు 61వ తీర్థ మహోత్సవం సందర్భంగా నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను జెసిఎస్ మండల కన్వీనర్, చందులూరు ఎంపిటిసి యడ్ల కిషోర్ కుమార్ ప్రారంభించారు. ఈ పోటీలో గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.10వేలు, రూ.6వేలు, రూ.4వేలు నగదు అందిస్తామని కిషోర్ కుమార్ తెలిపారు. దీంతో పాటు బెస్ట్ బౌలర్, బెస్ట్ బ్యాటింగ్, బెస్ట్ ఆల్రౌండర్‌గా నిలిచిన విజేతలకు కూడా ప్రత్యేక బహుమతులు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు బోని అప్పలనాయుడు, కసిరెడ్డి వినయ్, యడ్ల ప్రసాద్, జోగారావు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

తెర్లాం: మండలంలోని పెరుమాలి గ్రామంలో వైస్ ఎంపిపి రమాదేవి, సర్పంచ్ హేమలత ఆధ్వర్యంలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు, కాలువ నిర్మాణాలను ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి శ్రీనివాసరావు ఆదివారం పరిశీలించారు. పనుల్లో నాణ్యతను పరిశీలించి పలు సూచనలు చేశారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

బొబ్బిలి: ప్రజా సంక్షేమానికి వైసిపిని గెలిపించాలని మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, పట్టణ జెసిఎస్ కన్వీనర్ రేజేటి విస్సు కోరారు. మున్సిపాలిటీలోని ఆదివారం గొల్లపల్లిలో మేము సిద్ధం-మాబూత్ సిద్ధం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి, అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

మడ్డువలసలో అన్నదానం

వంగర: మండలంలోని మడ్డువలసలో భారీ అన్నదాన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. గ్రామ దేవత పైడితల్లి అమ్మవారు సంబరాల్లో భాగంగా ఈ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మగ్గూరు, వంగర, ఓని అగ్రహారం, నీలయ్యవలస తదితర గ్రామాలకు చెందిన ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.